

రూ.3.35 లక్షలతో దేవికి మాల

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని దేవి విహార్‌లో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారికి రూ. 3,35,222 నగదు మాలతో అలంకరించారు. మహాలక్ష్మి దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

మత్స్యకారులకు న్యాయం చేసేందుకు కృషి

బాన్సువాడ, న్యూస్‌టుడే : దళారీ వ్యవస్థను అరికట్టి మత్స్యకారులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో చేప పిల్లల్ని ఆయన విడుదల చేశారు. వాటి పరిమాణం తక్కువగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని తిరిగి పంపి పెద్దవి చెరువులో వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తనకు చేపలు పట్టి బతికే వారి జీవితాలు తెలుసని చెప్పారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి, బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, సురేష్, రవీందర్, బాబా, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్కి చెరువులో చేప పిల్లల్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

సమన్వయంతోనే.. సమస్యలు దూరం

ఈనాడు, కామారెడ్డి

పట్టింపు లేని ధోరణి

సిబ్బంది కొరత సాకును చూపి వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యతను కేంద్రాల నిర్వాహకులకే వదిలేస్తున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు తరుగు పేరుతో దోపిడీకి తెరదీస్తున్నారు. ఇటీవల జరిగిన బీర్కూర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో అన్నదాతలు సాక్ష్యాలతో దోపిడీ జరుగుతున్న తీరును వెల్లడించారు.

కొంటా వేసిన ధాన్యాన్ని మిల్లుల్లో దించుకునే సమయంలో మిల్లర్లు కొర్రీలు పెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. దోపిడీకి పాల్పడిన ధాన్యం లెక్కలను చక్కదిద్దేందుకు పౌరసరఫరాల శాఖలో ప్రత్యేకంగా ఇద్దరిని నియమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. రైతుల పక్షాన ఉండాల్సిన సహకార కేంద్రాల పాలకులు, సిబ్బంది మిల్లర్లకు వంత పాడుతున్నారనే విమర్శలున్నాయి.

టార్పాలిన్లు, తేమ శాతం నిర్ధారించే, తూకం వేసే యంత్రాలను సరఫరా చేయాల్సిన మార్కెటింగ్ శాఖ ధాన్యం కొనుగోళ్లతో తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది. మూడేళ్లుగా మార్కెటింగ్ శాఖ అధికారి నిర్లక్ష్య వైఖరిపై కర్షకులు, రైతుసంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం.

ఏటా మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో రెవెన్యూ, సహకార, మార్కెటింగ్, రవాణా, వ్యవసాయ, పోలీసు శాఖలకు చెందిన అధికారులతో కమిటీలు వేసినా.. అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. అన్నదాతలు రహదారులపైకి వచ్చి ఆందోళనలు చేపడితేనే రెవెన్యూ యంత్రాంగం సేకరణలో భాగస్వామ్యం అవుతోంది.

సన్నాలు, దొడ్డురకాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు

కొన్నేళ్లుగా ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నా కొనుగోళ్లలో భాగస్వాములయ్యే శాఖల మధ్య సమన్వయం కుదరక సమస్యలు తలెత్తుతున్నాయి. దిగుబడులను విక్రయించుకునేందుకు గతంలో అన్నదాతలు అవస్థలు పడ్డారు. బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో సన్నాలకు కొన్నిచోట్ల ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాలను నిర్వహించే సహకార శాఖ, సేకరణలో కీలకంగా వ్యవహరించే పౌరసరఫరాలు, రెవెన్యూ, నాణ్యతను గుర్తించే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల యంత్రాంగం మధ్య సమన్వయం కుదిరితేనే అన్నదాతల సమస్యలు దూరం కానున్నాయి.



ధాన్యం సేకరణ

అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం

- శ్రీనివాస్‌రెడ్డి, అదనపు పాలనాధికారి, కామారెడ్డి



ఈ నెల 15 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించాం. నిబంధనలకు అనుగుణంగా సేకరణ జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. సన్నరకం ధాన్యం గుర్తించే నిమిత్తం సాంకేతిక నిపుణులతో కొనుగోళ్లలో భాగస్వాములయ్యే సిబ్బందికి శిక్షణిస్తున్నాం. శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం వివరాలు


- సన్నాలు, దొడ్డురకాలకు ఏర్పాటు చేసే కేంద్రాలు **356**
- కేవలం సన్నాలను ప్రత్యేకంగా కొనుగోలు చేసేవి **63**
- సన్నాల సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నులు లక్షల్లో) **1.98**
- దొడ్డురకం ధాన్యం (మెట్రిక్ టన్నులు లక్షల్లో) **4.80**

443 మందికి నియామకపత్రాలు

63 ఉపాధ్యాయ ఖాళీలపై వీడని ఉత్కంఠ

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

సుదీర్ఘకాల నిరీక్షణకు తెరపడింది. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో దసరా తర్వాత కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. జిల్లాలో వివిధ విభాగాల్లో 506 ఉపాధ్యాయ స్థానాల భర్తీకి సర్కారు ప్రకటన విడుదల చేసినా 443 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. వీరిని బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియానికి పంపేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వీరి కోసం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నారు.



చరవాణిలో సమాచారం

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల జాబితాలను డీఈవో కార్యాలయంలో నోటీసుబోర్డుపై ఉంచారు. అనంతరం అభ్యర్థులకు నేరుగా చరవాణిలో సమాచారం ఇచ్చారు. సాయంత్రం వరకు అర్హులందరికీ సంక్షిప్త సమాచారం రూపంలో కూడా తెలియజేశారు. ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామకపత్రాలు అందించాక దసరా తర్వాత వెబ్ ఆప్షన్లు అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలో ఖాళీలు ఉన్న చోట బడులను ఎంపిక చేసుకునేలా అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. పక్షం రోజుల్లో నూతన ఉపాధ్యాయులు బడులకు రానున్నారు.

విభాగాల వారీగా పోస్టులు ఇలా

మొత్తం 506 పోస్టుల్లో ఓసీలకు 163, ఎస్సీలకు 85, ఎస్టీలకు 45, బీసీ-ఏ 43, బీసీ-బి 38, బీసీ-సి 8, బీసీ-డి 22, బీసీ-ఈ 14, వికలాంగుల కోటాల్లో 28, ఈడబ్ల్యూఎస్ కోటాలో 43, క్రీడా విభాగంలో 5, విశ్రాంత సైనికుల కోటాలో 12 పోస్టులు భర్తీ చేసేందుకు డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల బడులు 481, సాధారణ బడుల్లో 25 పోస్టులు ఉన్నాయి. ఇందులో 443 మంది అభ్యర్థులను తాజాగా ఎంపిక చేశారు. మిగిలిన 63 మంది అభ్యర్థుల వివరాలు వెల్లడి కాలేదు. వికలాంగుల కోటా, ఇతర విభాగాల్లో విచారణకు పిలిచిన వారి దరఖాస్తులను హైదరాబాద్‌కు పంపారు. రోస్టర్ పాయింట్లు కుదరక ఆయా విభాగాల ఉద్యోగాల విషయంలో నియామక ప్రక్రియలో జాప్యం నెలకొంది.

★ 'జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీని వేగవంతం చేశాం. ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌కు రావాలి. వీరికి ప్రత్యేక బస్సులను జిల్లాకేంద్రంలో అందుబాటులో ఉంచాం.' అని డీఈవో రాజు అన్నారు.

నెట్టింట.. ఇందూరు బతుకమ్మ ★ ఓటరు జాబితాలో మీ పేరుందా..? 12లో

మురిపించిన నైరుతి

జిల్లాలో 12.4 శాతం అధిక వర్షపాతం నమోదు

న్యూస్‌టుడే, కామారెడ్డి వ్యవసాయం



లింగాపూర్‌లో వరి పొలాలు

నైరుతి రుతుపవనాలు జిల్లాలో వానాకాలంలో(జూన్- సెప్టెంబరు) కురవాల్సిన దానికంటే 12.4 శాతం ఎక్కువ వానలు కురిపించాయి. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వాగులు-వంకలు పొంగి చెరువులు-కుంటలు అలుగులు పారాయి. భూగర్భ జలాలు సైతం పెరగడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాను మించి..

జిల్లాలో 5.43 లక్షల మేర వ్యవసాయ భూమి ఉండగా 3.11 లక్షల మంది రైతులున్నారు. జిల్లాలో మొత్తం 1425 చెరువులు-కుంటలున్నాయి. వానలు సమృద్ధిగా కురవడంతో వీటిలో 824 అలుగు పారుతున్నాయి. మరో 233 వరకు చెరువులు పూర్తిగా నిండాయి. నిజాంసాగర్, కౌలాస్‌నాలా, పోచారం జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. అంచనాను మించి పత్తి, కంది, సోయా పంటలు సాగయ్యాయి. మొత్తం సాగు విస్తీర్ణం అధికారుల అంచనా ప్రకారం 5,14,686 ఎకరాలు కాగా 5,43,401 ఎకరాల్లో పంటలు వేశారు.

మండలాల వారీగా వర్షపాతం (శాతాల్లో)

అధికం (+)		లోటు (-)	
నస్రుల్లాబాద్	38.5	జుక్కల్	10.1
బాన్సువాడ	26.5	పెద్దకొడపగల్	13.2
సదాశివనగర్	53.9	బిచ్కుంద	0.4
తాడ్వాయి	43.9	పిట్లం	13.8
రాజంపేట	21.1	నిజాంసాగర్	16.8
భిక్కనూరు	53.0	ఎల్లారెడ్డి	4.2
కామారెడ్డి	36.5	బీబీపేట	9.1
రామారెడ్డి	27.1	డోంగ్లి	6.4

అధిక దిగుబడులకు ఆస్కారం



ఈసారి వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడులు అదే స్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి. వరి సన్న, దొడ్డు రకాలకు సంబంధించి 7.37 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశముంది. ఇతర పంటల దిగుబడి 81,915 మెట్రిక్ టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నాం. **- తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి**

ఉండాల్సింది 42.. ఉన్నది 30 ఎకరాలే

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయం పరిధిలోని జలవిద్యుదుత్పత్తి కేంద్రం (జెన్‌కో) భూమి కేవలం 30 ఎకరాలుగా సర్వేలో తేలిందని రెవెన్యూ సర్వేయర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఈనాడులో 'కబ్జా కోరల్లో జెన్‌కో భూములు' శీర్షికతో కథనం ప్రచురితమవడంతో జెన్‌కో, రెవెన్యూ అధికారులు స్పందించి మంగళవారం సర్వే ప్రారంభించారు. గత నెల 27న రాష్ట్ర జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ జలవిద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి జెన్‌కో భూములు 42 ఎకరాలు ఉండగా ప్రస్తుతం కబ్జాకు గురైందని సర్వే చేయాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సర్వేయర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. జెన్‌కో అధికారులు చూపించిన ప్రాంతంలోనే సర్వే చేశానని 63, 70, 71 సర్వే నంబర్లలో 30 ఎకరాల భూమి ఉందని, వాటికి సంబంధించిన పత్రాలు లేవని తెలిపారు. మరోవైపు జెన్‌కో అధికారులు నామమాత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకొంటున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు భూ కబ్జాలపై దృష్టి సారించి కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. సర్వేలో జెన్‌కో అధికారులు ఏడీ రవికుమార్, సివిల్ ఏఈ నియంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పల్లి శివారులోని జెన్‌కో భూమి సర్వే చేస్తున్న అధికారులు



కేంద్ర బృందం అధికారి కరుణాకరణ్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

జలశక్తి అభియాన్ పనులపై వివరణ

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో చేపడుతున్న జలశక్తి అభియాన్ పనుల గురించి ఆయా శాఖల అధికారులు మంగళవారం కేంద్ర బృందానికి వివరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి బెంజిమెన్ కరుణాకరణ్‌తో పాటు కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధి, భూగర్భజలం, అటవీ, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యానవనశాఖల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులు కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా చూపించారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న కరుణాకరణ్‌కు కలెక్టర్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్‌వో నిఖిత, శాస్త్రవేత్త ఆచార్య శ్రీకృష్ణపవార్, జడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి జ్యోతి, భూగర్భజలశాఖ ఏడీ సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాబితా రూపకల్పనపై చర్చ

కామారెడ్డి కలెక్టరేట్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీసీలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పాల్గొన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాకు సంబంధించిన సమాచారం అందించారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పనపై చర్చించారు.

వివరాల నవీకరణ

జుక్కల్, న్యూస్‌టుడే: జిల్లా వెబ్‌సైట్‌లో అధికారుల వివరాలు తప్పుగా ఉండటంపై ఈనాడులో ఈ నెల 8న 'తప్పుల తడక.. ప్రజల తికమక' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పరిపాలన అధికారులు స్పందించారు. మంగళవారం వెబ్‌సైట్‌లో జిల్లా అధికారుల పేర్లతో పాటు మండల స్థాయి అధికారులైన ఎంపీడీవోలు, ఎంఈవోల పేర్లు, చరవాణుల నంబర్లలో మార్పులు చేస్తూ నవీకరించారు. ఇంకా పలు మార్పులు చేయాల్సి ఉంది.



గేట్లెత్తి.. జలాలు వదిలి!

శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 34,086 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తి స్థాయిలో నీటినిల్వ ఉన్నందున వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు వరద గేట్లను ఎత్తి గోదావరి నదిలోకి 12,496 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం 80.501 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.



-న్యూస్‌టుడే, శ్రీరామసాగర్



తుక్కు తీయరు.. వేలం వేయరు

కామారెడ్డి జిల్లాకేంద్రంలో అశోక్‌నగర్ కాలనీలోని ఆబ్కారీ శాఖ సీఐ కార్యాలయం లోపల, ముందు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు చాలా కాలంగా తుప్పు పట్టిపోతున్నాయి. వాటిని వేలం వేయడం లేదు. కేసులు తేలకుండా వేలం వేయడం కుదరదని అధికారులు చెబుతున్నారు. కొన్ని వాహనాలను మాత్రం ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లనే వేలం వేయడం కుదరడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

- న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

త్వరలో తెవివికి ఉపకులపతి

పరిశీలనలో ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడి పేరు

ఈనాడు, నిజామాబాద్

తెలంగాణ విశ్వవిద్యాలయానికి త్వరలో కొత్త ఉపకులపతి రానున్నారు. రాష్ట్రంలో పది వర్సిటీల వీసీల ఎంపిక కోసం సెర్చ్ కమిటీల నియామకం కాగా.. ఏడు వర్సిటీల కమిటీల సమావేశాలు ఇదివరకే పూర్తయ్యాయి. రెండు వర్సిటీల సమావేశాలు రద్దవ్వగా.. తాజాగా మంగళవారం తెవివికి సంబంధించి భేటీ జరిగింది. కమిటీలో ప్రభుత్వ నామినీగా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వర్సిటీ ఈసీ నామినీగా ఓయూ పూర్వ వీసీ సులేమాన్ సిద్ధిఖీ, యూజీసీ నామినీగా హిమాచల్‌ప్రదేశ్‌లోని ఓ వర్సిటీ వీసీ హాజరయ్యారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హతల ఆధారంగా మూడు పేర్లు ఎంపిక చేశారు. ఈ వివరాలు ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి దస్త్రం గవర్నర్‌కు పంపి, చివరకు ఒకరిని ఎంపిక చేసి ఆమోద ముద్ర వేశాక అధికారికంగా వెల్లడించనున్నారు. దసరాలోపే ప్రక్రియ పూర్తికి కసరత్తు చేస్తున్నారు.



135 దరఖాస్తులు

తెవివి ఉపకులపతి పదవి కోసం 135 దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో ఇతర వర్సిటీలకు దరఖాస్తు చేసుకున్న జాబితాలో ఒకరి పేరును కమిటీ ఎంపిక చేసినట్లు సమాచారం. సదరు ఆచార్యుడు ఓయూ న్యాయవిద్య విభాగంలో పని చేస్తున్నారు. దాదాపు ఆ పేరు ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారమవుతోంది.

ఒకే ఒక్కడు

- నిజామాబాద్ రైల్వే ఠాణా పరిధిలో 36 స్టేషన్లు
- పది నెలల్లో 171 కేసులు నమోదు

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ, డిచ్‌పల్లి గ్రామీణం

నిజామాబాద్ రైల్వే ఠాణా పరిధి 400 కిలో మీటర్లు. మొత్తం 36 రైల్వే స్టేషన్లు. దొంగతనాలు, హత్యలు, ఆత్మహత్యలు, రైళ్లలో నుంచి పడి మృతిచెందడం, గంజాయి అక్రమ రవాణా తదితర ఘటనలు నిత్యకృత్యం. ఇంత విస్తీర్ణంలో నేరాల అదుపు, కేసుల నమోదు, పర్యవేక్షణ చూసేందుకు ఒకే ఎస్‌హెచ్‌వో ఉన్నారు. కేసుల ఛేదన భారమవుతోంది.

నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధి దక్షిణాన మెదక్ జిల్లా మనోహరాబాద్, ఉత్తరాన నిర్మల్ జిల్లా బాసర, ఆదిలాబాద్, పడమర బోధన్ మొదలుకొని.. తూర్పున జగిత్యాల వరకు విస్తరించి ఉంది. రైల్వే స్టేషన్ల పరిధిలో ఎక్కడ కేసైనా నిజామాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోనే ఎఫ్ఐఆర్ నమోదువుతుంది. గత ఏడాది కాలంలో 171 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నిజామాబాద్ రైల్వే ఠాణాలో ఎస్‌హెచ్‌వోతో పాటు నలుగురు మహిళా, 8 మంది పురుష కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. కామారెడ్డి, ఆదిలాబాద్, బాసరలో పోలీసు ఔట్‌పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఒక్కోచోట ముగ్గురు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆయా చోట్ల చిన్నచిన్న కేసులుంటే సిబ్బంది చూసుకుంటారు. ఆత్మహత్యలు, హత్యలు, ఇతర పెద్ద ఘటనలు జరిగితే ఎస్‌హెచ్‌వో వెళ్లాల్సిందే. పనిభారం పెరిగి కేసుల ఛేదన గగనంగా మారింది. ఇటీవల నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, మెదక్ జిల్లా గజ్వేల్‌లో కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పడ్డాయి. వీటి పరిధిలో కొత్త రైల్వే ఠాణాలు నెలకొల్పితే నిజామాబాద్ ఠాణాపై ఒత్తిడి తగ్గనుంది.

గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసుల తీరు

దొంగతనాలు	55
ప్రమాదవశాత్తు మరణాలు	35
ఆత్మహత్యలు	32
రైళ్లలో సహజ మరణాలు	24
ఇతర కేసులు	25



ఎస్‌హెచ్‌వో సాయిరెడ్డి

నెట్టింట.. ఇందూరు బతుకమ్మ

● ప్రత్యేకత చాటుకుంటున్న ఇందూరు యువత

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నేటి యువత ఆలోచన తీరు మారింది. సంప్రదాయానికి సాంకేతికతను జోడిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ విశ్వవ్యాప్తం చేస్తున్నారు. బతుకమ్మ వేడుకల వీడియోలు, చిత్రాలను ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నారు. కొందరు పండగ విశిష్టతలపై లఘు చిత్రాలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటే, మరికొందరు రీల్స్ చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు పల్లె సంప్రదాయానికి పట్టం కడుతున్నారు. వీరి కృషికి దేశ, విదేశాల నెటిజన్ల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి.

ఇన్‌స్టాలో వేడుకలు

- వసంత, కసాబ్‌గల్లీ, నిజామాబాద్

నాలుగైదేళ్లుగా బతుకమ్మతో సెల్ఫీలు దిగి దాచుకున్నా. రెండేళ్లుగా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌లో షేర్ చేస్తున్నా. ప్రశంసలు వస్తుండటంతో స్నేహితురాళ్లు అక్షిత, భవ్యశ్రీ, శైలజ, పూజిత, జాగృతి, ఉజ్జయినితో కలిసి బతుకమ్మ ఆడి వీడియోలు పోస్ట్ చేస్తున్నా. చాలా మంది ఇతర ప్రాంతాల వారు స్నేహితులయ్యారు. హైదరాబాద్, దిల్లీ, చెన్నై నగరాల నుంచే కాకుండా దుబాయి, అమెరికా, లండన్ తదితర ప్రాంతాల్లోని తెలుగువారు లైక్‌లు కొట్టి అభినందిస్తున్నారు. అక్కడ జరిగే వివిధ పండగల చిత్రాలు, వీడియోలు నాకు పంపిస్తున్నారు. బతుకమ్మతో మాకు కొత్త మిత్రులు దొరికారు.





రీల్స్ చేస్తున్నాం

- వర్ష, డిగ్రీ విద్యార్థిని, న్యాల్‌కల్‌రోడ్డు, నిజామాబాద్

గతంలో సినిమా, జానపద గీతాలపై రీల్స్ చేసేవాళ్లం. ఈ ఏడాది నుంచి నా మిత్రులు రోహిత, తేజోమయి, వందనతో కలిసి బతుకమ్మపై వీడియోలు చేస్తున్నాం. మన ఆచార వ్యవహారాలు నేటి యువతకు అందించేందుకు ఆసక్తికరమైన రీల్స్ చేస్తున్నాం. బతుకమ్మ పాటల విశిష్టతను సొంతంగా ఎడిట్ చేసి రీల్స్ రూపొందిస్తున్నాం. ఈ నెల 3న గిరిరాజ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలను చిత్రీకరించి ఇన్‌స్టాలో జీజీసీ.ఎన్‌జెడ్‌బీ పేరుతో షేర్ చేశాం. వందల్లో లైక్‌లు వచ్చాయి. పూర్వవిద్యార్థులూ స్పందించి అభినందించారు.

యూట్యూబ్‌లో లఘుచిత్రాలు

- రమ్యా ఆనంద్, బోధన్

తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చడం, లయబద్ధంగా వలయాకారంలో తిరుగుతూ బతుకమ్మ ఆడటం చూడముచ్చటగా ఉంటుంది. గ్రామీణ మహిళలు బతుకమ్మ పాటలను అలవోకగా పాడేస్తుంటారు. స్వచ్ఛమైన పల్లెసంస్కృతి కాపాడుతున్న మహిళలను సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం చేయాలని భావించి మల్టీమీడియా కోర్సు నేర్చుకున్నా. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో లఘు చిత్రాలు తీస్తున్నా. ఇటీవల బతుకమ్మ పేరుతో యూట్యూబ్‌లో పెట్టిన లఘు చిత్రానికి మంచి పేరొచ్చింది. పల్లె సంస్కృతిని ప్రతిబింబించే మరిన్ని వీడియోలు తీస్తా.



పోటీలు నిర్వహిస్తున్నా..

- సుంకరి కార్తిక్, చిత్రపురి ఫిల్మ్ వ్యవస్థాపకుడు, నిజామాబాద్

బీటెక్ తర్వాత పుణెలో ఫిల్మ్ మేకింగ్‌పై కోర్సు చేశా. ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు వద్ద పలు చిత్రాలకు పనిచేశాను. బతుకమ్మపై ఇప్పటి వరకు 10 లఘుచిత్రాలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే వేలల్లో లైక్‌లు వచ్చాయి. యువతను ప్రోత్సహించేందుకు చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్నా. ఉత్తమంగా నిలిచిన వాటికి బహుమతులు ఇస్తున్నాం. గ్రామీణ సంస్కృతిని కాపాడుకోవాలి.



ఓటరు జాబితాలో మీ పేరుందా..?

● ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. కానీ చాలా మంది అక్కడికి వెళ్లి ఓటరు జాబితా సరిచూసుకోవడానికి సమయం కేటాయించరు. అయితే ఇప్పుడు ఓటరు జాబితాలో మీ పేరు ఉంది లేనిది అరచేతిలో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ పేరు ఓటరు జాబితాలో ఉంది లేనిది ఇట్టే చూసుకోవచ్చు.

● ముందుగా గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in అని టైప్ చేయగానే తెలంగాణ ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. అందులో ఫైనల్ రోల్స్ జీపీ/వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే ఐచ్ఛికం కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయాలనే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత సదరు పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. అందులో వార్డుల వివరాలు కూడా ఉంటాయి. మనం నివసించే వార్డుకు సంబంధించిన బాక్సును క్లిక్ చేస్తే మన వివరాలు మొత్తం కనిపిస్తాయి.



జిల్లా, మండలం, గ్రామం వివరాలు చూపించే పేజీ

పీఆర్టీయూ రాష్ట్రశాఖలో చోటు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి అర్బన్ పీఆర్టీయూ శాఖ నుంచి రాష్ట్ర కార్యవర్గంలో పలువురికి చోటుదక్కింది. రాష్ట్ర సహ అధ్యక్షులుగా పోచయ్య, మాణిక్యం, గోవర్ధన్, రమేశ్, అశోక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుంధతి, ఉపాధ్యక్షుడిగా మధుకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎన్నికైన వారు పేర్కొన్నారు.

'రైతు భరోసా ఎక్కడ?'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి రైతు భరోసా నగదును వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరానికి రూ.7500 రైతు భరోసా కల్పించాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, ప్రతినిధులు నర్సింలు, అరుణ్, రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ

దిష్టిబొమ్మల్.. అటవీ జంతువులు హడల్

పంటలు కోతకొచ్చాయి. ఈ రెండు నెలలు రైతులకు కీలకమైన సమయం. అడవి పందులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు స్పీకర్లతో శబ్దాలు చేస్తుంటే మరికొందరు దిష్టిబొమ్మలు పెడుతున్నారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ఎల్లమ్మకుంట నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి మార్గంలో వ్యవసాయ పొలాల్లో విభిన్న రూపాల్లో దిష్టిబొమ్మలు ఏర్పాటు చేయడంతో అటవీ జంతువులు పరారవుతున్నాయి. - ఈనాడు, నిజామాబాద్



సగం దారి పార్కింగ్‌కే..

ఈ చిత్రం కామారెడ్డి కలెక్టరేట్‌లోనిది. ఇక్కడ పార్కింగ్ సౌకర్యం లేక ఉద్యోగులు, ప్రజలు ఇలా రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. పార్కింగ్ షెడ్డు కోసం గత ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేసినా.. ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. సగం రోడ్డు వాహనాలు నిలిపేందుకే సరిపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. - న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



వ్యాపారం.. వినూత్నం

విభిన్నంగా వ్యాపారం చేస్తున్నారు మాక్లూర్ మండలం చిక్లీకి చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తి. ఆయన ఇది వరకే పలు వ్యాపారాలు చేశారు. స్వతహాగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తారు. ఒకే చోట, ఒకే తరహా వ్యాపారం చేయడం బాగా లేదని గ్రహించి తనకున్న ద్విచక్ర వాహనాన్ని వ్యాపారానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. కోకా ఆకారంలో ఉండే రేకుల డబ్బాను రూ.32 వేలతో తయారు చేయించి వాహనానికి జత చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాన్‌కు సంబంధించిన సరకులు, సాయంత్రం చిరుతిళ్లు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద గంటకుపైగా విక్రయాలు చేస్తారు. తర్వాత మరో గ్రామం వెళ్తారు. నవీపేట మండలం జన్నేపల్లిలో తీసిన చిత్రమిది. - న్యూస్‌టుడే, నవీపేట



13 నుంచి కాజీపేట-దాదర్ రైలు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ఈ నెల 13వ తేదీ నుంచి కాజీపేట- దాదర్((07195/96) రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తొమ్మిది నెలల క్రితం అయోధ్య ప్రయాణికుల కోసం ఈ రైలును నడిపి రద్దు చేశారు. తాజాగా పునః ప్రారంభించినట్లు చెప్పారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల మీదుగా కాజీపేట నుంచి దాదర్ వెళ్లనుంది. రైలు సేవలు పునరుద్ధరించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విన్నవించడంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రాజెక్టు నిండుగా.. రైతులకు పండుగ

● పంటల సాగుకు 59.172 టీఎంసీల విడుదల ● కొనసాగుతున్న వరద

న్యూస్‌టుడే, శ్రీరామసాగర్

శ్రీరామసాగర్ ప్రాజెక్టు.. జలకళను సంతరించుకొంది.. నిండుకుండలా మారింది.. ఎగువ నుంచి వరద చేరిక కొనసాగుతోంది. సెప్టెంబరు మొదటి వారంలోనే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. పరవళ్లు తొక్కుతూ వస్తున్న జలాలను గేట్ల ద్వారా నదిలోకి వదులుతుంది.. వానాకాలం పంటలకు వివిధ కాలువల ద్వారా సాగునీరు అందిస్తోంది.. వచ్చే యాసంగికి నేనున్నానని భరోసా కల్పిస్తోంది..

వానాకాలం పంటలకు ఆగస్టు 7వ తేదీ నుంచి నీటిని విడుదల చేశారు. వరుణుడు రైతుల ఆశలను వమ్ము చేయకుండా వారం రోజుల పాటు జోరుగా కరుణించడంతో జలాశయంలోకి సెప్టెంబరులో భారీగా వరద చేరింది. జూన్ 1వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు 238.347 టీఎంసీల నీరు చేరింది. పూర్తి స్థాయిలో 80.501టీఎంసీల నీటిని నిల్వ చేయగా మిగతా 165.247 టీఎంసీలను మిగులు జలాలుగా విడుదల చేశారు. గోదావరిలోకి 99 టీఎంసీలు వదిలారు. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతి, లక్ష్మి, వరద కాల్వతో పాటు ఎత్తిపోతల ద్వారా రైతుల పంటల సాగుకు 59.172 టీఎంసీలు పంపారు. మొత్తం 7.56 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నారు.



శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్న నీరు

కాల్వలు, ఎత్తిపోతలకు విడుదలైన నీరు (టీఎంసీలు)	కాకతీయ	వరద	సరస్వతి	లక్ష్మి	అలీసాగర్	గుత్ప	మిషన్ భగీరథ
	25.01	32.05	1.396	0.435	0.119	0.162	2.590

క్షేత్రస్థాయిలోనే పరీక్షలు చేయాలి

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలు జ్వర బాధితులను గుర్తిస్తే వారి ఇంటి వద్దనే ఆర్డీటీ పరీక్ష నిర్వహించి వ్యాధి నిర్ధారించాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు. డెంగీ కేసు నమోదైన పరిసరాల్లో 50 ఇళ్లలో జ్వర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మండల వైద్యాధికారి సంతోష్ కుమార్, హెచ్‌ఈవో శంకర్, ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్ అలీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్

సంచి నుంచి రూ.లక్ష చోరీ

బాన్సువాడ, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ పాలకేంద్రం వద్ద ద్విచక్ర వాహనంలోని సంచి నుంచి రూ.లక్ష గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సంగమేశ్వర కాలనీకి చెందిన సమీరొద్దీన్ ఓ బ్యాంకులో మంగళవారం రూ.లక్ష డ్రా చేశారు. డబ్బులు ద్విచక్ర వాహనంలోని సంచిలో పెట్టుకొని ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో పాల కేంద్రం వద్ద బండి నిలిపి పాలు కొనుగోలు చేశారు. తిరిగి వాహనం వద్దకు వచ్చి చూసే సరికి సంచిలోని రూ.లక్ష కనిపించలేదు. పరిసరాలు వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



లక్ష గాజులతో అలంకరణ

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని తూర్పు హౌసింగ్‌బోర్డు కాలనీలో శారదాంబ ఆలయంలో అమ్మవారు మంగళవారం కాత్యాయని దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేశారు. పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

స్వదేశీ మేళా ప్రతుల ఆవిష్కరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించే స్వదేశీ మేళా కార్యక్రమ కరపత్రాలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వదేశీ జాగరణమంచ్ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేళాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కేశవ్ సోని, రాజాగౌడ్, రాహుల్, యాలాద్రి, మనీశ్, భాజపా జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.



ప్రతులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, స్వదేశీ జాగరణమంచ్ ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిప్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పునకనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు భూపతి, శ్రవణ్, మహేష్, సదానంద్ తదితరులు ఉన్నారు.



సొసైటీ డైరెక్టర్ ఆత్మహత్య

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం వెల్మల్ గ్రామానికి చెందిన గాదరి రాజలింగం (55) అలియాస్ లాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కొడుకు సతీశ్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. మంగళవారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందారు. రాజలింగం ప్రస్తుతం అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిన ఆయన తల్లి మానసికవేదనకు గురై శనివారమే మృతి చెందారు. రాజలింగం ఇటీవల నూతన గృహ నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజలింగం



బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

ఆడుతూ.. అనంతలోకాలకు

● ట్రాక్టర్ బోల్తాపడి బాలుడి దుర్మరణం

లింగంపేట, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తా పడి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన లింగంపేట మండలం బోనాల్ పంచాయతీ పరిధిలోని బోనాల్ తండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బోనాల్‌తండాకు చెందిన రామావత్ భాస్కర్ తన ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలోని రహదారిపై దిగుడు గల ప్రదేశంలో గేర్లు వేసి నిలిపి పనుల నిమిత్తం కామారెడ్డి వెళ్లారు. తన కుమారుడైన రమావత్ రిషికేష్(5) ట్రాక్టర్ పైకి ఎక్కి ఆడుతుండగా.. గేర్లు మార్చడంతో ఒక్కసారిగా వేగంగా ముందుకు కదిలి సమీపంలోని పంట పొలాల్లో ట్రాలీ బోల్తా పడింది. ఈ క్రమంలో బాలుడు అదుపుతప్పి పడిపోయాడు. తలకు, ముక్కుకు బలమైన గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. తండావాసులు గమనించి ట్రాక్టర్‌ను ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బాలుడి మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడి మరణ వార్త తెలిసి తల్లిదండ్రులు నిర్మల, భాస్కర్ రోదించిన తీరు స్థానికులను కలచివేసింది.



రిషికేష్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



పట్టణంలోని పీహెచ్ కాలనీలో చెత్త తొలగించడం లేదని స్థానికుడు మధు ఈనాడు దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.



వాసవీనగర్‌లో గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారడంపై స్థానికుడు వినయ్ సమస్యను ఈనాడు దృష్టికి తేగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి మరమ్మతులు చేయించారు.



పట్టణంలోని బతుకమ్మకుంటలో మినీ ట్యాంకులో నీళ్లు నింపకపోవడంపై ఆర్బీనగర్ వాసి రాజు సమస్యను వివరించగా కమిషనర్ సుజాత స్పందించి నీళ్లు నింపేలా చర్యలు చేపట్టారు.

పాత బాన్సువాడలోని 9వ వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో పేరుకుపోయాయి. **- నాగరాజు, బాన్సువాడ**



ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో సమస్య పరిష్కరింపజేశారు.

పిట్లం మండల కేంద్రంలోని నేతాజీ నగర్ కాలనీ నుంచి గడీకి వెళ్లే మార్గంలో మురుగు కాల్వపై వేసిన స్లాబు పగిలి ప్రమాదకరంగా మారింది. **- రాజు, స్థానికుడు**

స్లాబు మరమ్మతులకు చర్యలు చేపడతాం. **- యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం**

- న్యూస్‌టుడే, పిట్లం,బాన్సువాడ పట్టణం, కామారెడ్డి పట్టణం

దాబాలపై పోలీసుల దాడులు

కామారెడ్డి నేర విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని రహదారుల వెంట దాబాలు నిర్వహిస్తూ.. మద్యం అమ్మకాలను నడిపిస్తున్న యజమానులపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. దోమకొండ, బిచ్కుంద, లింగంపేట్, పెద్దమల్లారెడ్డి, గాంధారి, పెద్దకొడప్‌గల్, పొందుర్తి వద్ద గల దాబాలపై కేసులు నమోదు చేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

బాన్సువాడ, న్యూస్‌టుడే: గ్రామంలో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని హన్మాజీపేట్ నాయకులు మంగళవారం ఆహ్వానించారు. ఈ నెల 22న కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంగ్రాంనాయక్, సుధాకర్‌రెడ్డి, బాలయ్య, గణేష్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామాన్ని దేవునిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జోహ మంగళవారం సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో రికార్డులు పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు.

ఆయిల్‌పాం పరిశీలన

తాడ్వాయి, న్యూస్‌టుడే: అబ్దుల్లానగర్ శివారులోని పైడి సంయుక్తరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పాంను కేంద్ర జలశక్తి అభియాన్ డిప్యూటీ కార్యదర్శి బెంజిమాన్ కరుణాకరన్ పరిశీలించారు. బిందు సేద్యం పరికరాలు పరిశీలించి పంట సాగు విధానంపై ఆరా తీశారు. విభిన్న పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవో సాజిద్ అలీ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రపహాడ్‌కు చెందిన బ్యాంక్ బాల్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బాల్‌రెడ్డి భారాసలో సీనియర్ నాయకుడిగా పనిచేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు జలందర్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.



బాల్‌రెడ్డికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

అదుపు తప్పితే.. ప్రమాదమే



ప్రగతి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం ఆవరించింది. పది కాలాలపాటు మన్నాల్సిన పనులు అధ్వానంగా మారాయి. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయకాలనీలో సీసీ రోడ్డు పక్కన భారీ గుంత ఏర్పడింది. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

గుంతలు.. ప్రయాణికులకు ఇబ్బందులు



రామారెడ్డి నుంచి రెడ్డిపేట్‌కు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో గుంతలు ఉండడంతో వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. కామారెడ్డి నుంచి రామారెడ్డి మీదుగా సిరికొండ, ధర్పల్లి, మాచారెడ్డి మండలాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారిపై వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. గుంతలు కనబడక రాత్రి వేళ వారం రోజుల్లో రెడ్డిపేట్ గ్రామానికి చెందిన ఇద్దరు గాయపడ్డారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ రవితేజను వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. **-న్యూస్‌టుడే, రామారెడ్డి**

చెట్ల కొమ్మల్లో నియంత్రిక



చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్తు నియంత్రిక కామారెడ్డి అశోక్ నగర్‌లోనిది. నీటి ట్యాంకుల పక్కన ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన దీనిని చెట్ల కొమ్మలు కప్పేశాయి. వర్షం పడితే చెట్ల కొమ్మల ద్వారా నియంత్రిక చుట్టూ ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశం ఉంది. మూగజీవాలు, చిన్నపిల్లలు ఈ మార్గంలో ఎక్కువగా తిరుగుతుంటారు. విద్యుత్తు అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి సంక్షేమం

మరమ్మతులు చేపట్టరూ..



జిల్లాకేంద్రంలో పంచముఖి కాలనీ హనుమాన్ ఆలయం పక్క నుంచి అడ్లూర్ వెళ్లే రోడ్డు అక్కడక్కడా ధ్వంసమైంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించండి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా, మండలకేంద్రాల్లో బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వేడుకల నిర్వహణపై ఆయాశాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల సభ్యులు సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. బతుకమ్మల నిమజ్జనానికి చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి బావన్న, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సంచులపై కోడ్ వేయాలని ఆదేశం

కామారెడ్డి సంక్షేమం: వరిధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సహకార సంఘాల సీఈవోలు, ఐకేపీ బాధ్యులు, ఏఈవోలకు ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. సన్నాలు, దొడ్డు రకం ధాన్యాన్ని వేరు వేరుగా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి సంచిపై కేంద్రం కోడ్, జిల్లా కోడ్ వేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఏఎస్‌వో నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



హాసన్‌పల్లిలో ..



లింగంపేటలో



పుల్కల్‌లో



కామారెడ్డిలో పంచముఖి హనుమాన్ ఆలయం ఆవరణలో

రామసిలోరు.. ఎదురాయెనమ్మో ఈ వాడలోన...

జిల్లా వ్యాప్తంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు ఆడిపాడారు. చిన్నారులు సైతం బతుకమ్మలను ఎత్తుకుని సందడి చేశారు. పలువురు విద్యార్థులు కోలాటం ఆడుతూ అందరిని ఆకర్షించారు. పలు గ్రామాల్లో సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిత్తూ చిత్తూల బొమ్మ.. శివునీ ముద్దుల గుమ్మ అంటూ పాటలు పాడారు.

- న్యూస్‌టుడే బృందం



కామారెడ్డిలో



నస్రుల్లాబాద్‌లో..

భిక్కనూరులో..



బాన్సువాడ పట్టణంలో..

కలెక్టరేట్‌లో ఘనంగా ..



బతుకమ్మ ఎత్తుకున్న ఎస్సీ సంక్షేమాధికారిణి రజిత

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయాశాఖల మహిళా ఉద్యోగులు, స్వశక్తి మహిళలు కలిసి బతుకమ్మలను అందంగా పేర్చారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీజీవో, టీఎన్జీవోస్ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పాత బాన్సువాడలో



మద్నూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...



గాంధారిలో..



పెద్దకొడప్‌గల్‌లో



అల్లాపూర్‌లో

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కామారెడ్డి పట్టణం, రామారెడ్డి, మాచారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, న్యూస్‌టుడే: లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. రాజంపేటలో 18, భిక్కనూరు 34, దోమకొండ 49, బీబీపేట 32, మాచారెడ్డి 39, రామారెడ్డి 36, కామారెడ్డి రూరల్ 41, కామారెడ్డి పట్టణంలో 151 మందికి చెక్కులను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గజ్యానాయక్ తండా రైతు వేదికలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

స.హ చట్ట వారోత్సవాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టం 19వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. స.హ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రతినిధి సలీం హాజరయ్యారు. చట్టం ప్రాధాన్యాన్ని అభ్యర్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దిలీప్, ప్రతినిధులు రాజేశం, శ్రీనివాస్, రవి, లింగం, అన్వర్, మక్సూద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఘాట్‌లను మంగళవారం బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్కీచెరువు, పెద్దపూలు, ఎల్లయ్య చెరువు, పాత బాన్సువాడ చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కమిషనర్ శ్రీహరి రాజు, నాయకులు నర్సుగొండ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ శ్రీహరి రాజుతో చర్చిస్తున్న బల్దియా ఛైర్మన్ జంగం గంగాధర్



గాంధారిలో ప్రత్యేక పూజలు



బీర్కూర్: తిమ్మాపూర్‌లో.



పాత బాన్సువాడలో..



బాన్సువాడ కోట దుర్గామాత ..



కామారెడ్డి విద్యానగర్‌లో

అర్చనలు.. అన్నదానాలు

జిల్లావ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. మండపాల నిర్వాహకులు మంగళవారం అర్చనలు, అన్నదానాలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- న్యూస్‌టుడే, బృందం



బాన్సువాడ : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం దంపతులు



జిల్లాకేంద్రంలో ఆజాద్ హిందూ దుర్గా మండలి వద్ద



సదాశివనగర్‌లో



లింగంపేటలో



కామారెడ్డిలోని విద్యానగర్ జన్మభూమి రోడ్డులో ..



పోత్‌రెడ్డిపల్లి తండాలో



శేరిబీబీపేటలో..



బస్వాపూర్‌లో..

వాహనాల తనిఖీ

బాన్సువాడ, న్యూస్‌టుడే: డివిజన్‌లోని 108, 102 వాహనాలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మధుకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, వాహనాల పనితీరు పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని కల్కినగర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం పుర కమిషనర్ సుజాతకు విన్నవించారు. చెత్త సేకరణ వాహనం రావడం లేదని, వీధి దీపాల మరమ్మతులు చేపట్టడం లేదని వాపోయారు.

చేపల పెంపకంతో లాభాలు

దోమకొండ, న్యూస్‌టుడే: చేపల పెంపకంతో లాభాలు ఆర్జించవచ్చని దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం దోమకొండ మండల సమాఖ్యలో చేపల పెంపకంపై దోమకొండ, బీబీపేట మండల రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయంతో పాటు చేపల పెంపకం చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావచ్చని ఆయన అన్నారు. ఏఎంసీ ఛైర్మన్ రాజు, ఇన్‌ఛార్జి ఎల్‌డీఎం ఈశ్వర్‌సాయి, ఏపీఎంలు రాజు, బాలపోచయ్య, అక్వా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని రెండు పడక గదుల ఇళ్లను మంగళవారం ఆర్డీవో ప్రభాకర్ పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సకాలంలో పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు. మున్సిపల్ ఛైర్మన్ పద్మశ్రీకాంత్, కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో

మనస్తాపంతో ఆత్మహత్య

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆత్మకూరులో చోటు చేసుకున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన నాయికోటి కిష్టయ్య (55) వ్యవసాయం చేస్తుండేవాడు. కిష్టయ్య ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన వంగరి ప్రభువుల వద్ద కోళ్ల ఫారం లీజుకు తీసుకుని నిర్వహించారు. ఆర్థిక సమస్యలతో రోజు ఇబ్బంది పడేవాడు. తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం కోళ్లఫారం వద్ద కావలికి పోతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు వెతకగా గ్రామ శివారులోని ఎయిర్‌టెల్ టవర్ పక్కన ఉన్న వేపచెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. భార్య సులోచన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహన దొంగల అరెస్టు

రామారెడ్డి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహన దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. గొల్లపల్లి చౌరస్తా వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మెట్టు నవీన్, మెట్టు నరేష్ అనే వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారు. విచారించగా నాలుగు ద్విచక్రవాహనాలు దొంగతనం చేశామని అంగీకరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలే చోరీ

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: పట్టపగలే అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి నుంచి దుండగులు డబ్బులను దొంగిలించిన ఘటన తాండూరులో చోటుచేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి వివరాల ప్రకారం.. అక్కంపల్లికి చెందిన జక్కుల రాములుకు డబ్బులు అవసరం కాగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకుకు వెళ్లారు. రూ.85 వేలు విత్‌డ్రా చేసుకుని కవర్‌లో పెట్టుకుని నడుచుకుంటూ ఆటోస్టాండ్‌కు వెళ్లాడు. ఆటోలో తాండూరు వచ్చాడు. ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా హోండా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు చేతిలో నుంచి కవర్ లాక్కొని పారిపోయారు. దీనిపై బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎలక్ట్రిక్ వాహనం దగ్ధం

బాన్సువాడ, న్యూస్‌టుడే : పాత బాన్సువాడ రోడ్డులో మంగళవారం రాత్రి ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. రైస్ మిల్లులో పనిచేసే శ్రీకాంత్, తన కూతురు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనంలో మంటలు వచ్చాయి. వెంటనే ఇద్దరూ బండి దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పారు.



ఏఎంసీ ఛైర్మన్‌కు సన్మానం

దోమకొండ, న్యూస్‌టుడే: భిక్కనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పాత రాజును మంగళవారం దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సన్మానించారు. మండల పరిషత్ పర్యవేక్షకులు మనోహర్, సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు..

దోమకొండ: భిక్కనూరు ఏఎంసీ డైరెక్టర్ కదిరె గోపాల్‌రెడ్డిని పలువురు మంగళవారం సన్మానించారు. ఆయనకు శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. నాయకులు మన్నె సాయిరెడ్డి, బుర్రి రవికుమార్, చిట్యాల రాజిరెడ్డిలు, శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం

మద్నూర్, న్యూస్‌టుడే: మద్నూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు శనగ, మినుము విత్తనాల పంపిణీని సంఘం ప్రతినిధులు మంగళవారం ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు గోపాల్ ఏఈవో విశాల్ గౌడ్ పాల్గొన్నారు.

'అనుకూలంగా ఉన్న వారికే పంట రుణాలు'

లింగంపేట, న్యూస్‌టుడే: సింగిల్ విండో పాలకవర్గానికి, సిబ్బందికి అనుకూలంగా ఉన్న వారికే పంట రుణాలు మంజూరు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం లింగంపేట సింగిల్ విండోను వారు సందర్శించారు. మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులకు పంట రుణాలను ఇవ్వాలన్నారు. సింగిల్ విండో ఛైర్మన్ దేవేందర్‌రెడ్డి, రైతులు కాంతం, శ్రీనివాస్‌గౌడ్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు